క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బీమా నగదును అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీ చెందిన మణి అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమాకు సంబంధించి సాధారణ మరణానికి గానూ రూ.10 వేలు నగదును గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంబాబు గ్రామానికి వెళ్లి మృతుడి భార్యకు అందజేశారు. వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష వస్తుందని తెలిపారు. అంత్యక్రియలకు రూ.10 వేలు ఇచ్చి మిగిలిన రూ.90 వేలును నామిని అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏర్పేడు: తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని గోవిందవరంలో చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, గోవిందవరానికి చెందిన కృష్ణమ్మ(60) కడుపునొప్పి తాళలేక మంగళవారం ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు రేణిగుంటలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేసుకుని ఇంటికి తరలించారు. అనంతరం గురువారం మళ్లీ కడుపు నొప్పిరావడంతో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక తనిఖీలు ప్రారంభం



అంజిమేడులో కొలతలు తీస్తున్న డీఆర్పీ ఎం. వెంకటేశ్వరరావు

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. 2022 మార్చి 1 నుంచి 2023 ఏప్రిల్ వరకు జరిగిన రూ.8.18 కోట్లు ఖర్చుకు సంబంధించిన 1345 పనులకు సామాజిక తనిఖీలు 10 రోజుల పాటు జరుగనున్నట్లు ఎంపీడీఓ గిడ్డయ్య చెప్పారు. ఒక ఎస్సార్పీ, 20 మంది డీఆర్పీలు, 80 మంది వీఎస్ఏలతో తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు: మండలంలోని సదాశివపురంలో ఓ మహిళ అదృశ్యంపై ఫిర్యాదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన మంజుల(26) సమీపంలోని గుండ్లకండ్రిగ గ్రామంలోని తమ బంధువుల ఇంట్లో జరిగే సీమంతానికి ఈ నెల 1న వెళ్లింది. ఆరోజు సాయంత్రం వరకు ఇంటికిరాకపోవడంతో బంధువులు, తిరుపతి, రేణిగుంట తదితర పట్టణాల్లో వెతికి గురువారం భర్త మురళి ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

దివ్యాంగ పిల్లలకు శిక్షణ శిబిరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు శిక్షణా శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ జగదీష్, జాహ్నవి, ఈఎన్టీ నిపుణులు శ్రీనివాసులు దివ్యాంగులను పరీక్షించి వారి వైకల్యానికి అవసరమయ్యే ఉపకరణాలను సూచించారు. దీనికి శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రి, కేవీబీపురం నుంచి దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, సహిత విద్య ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ

శ్రీకాళహస్తి: న్యాయస్థానంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. వారు మాట్లాడుతూ పిటిషన్‌పై రూ.20 స్టాంపు అతికించాలన్న నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. కింది స్థాయి బార్ అసోసియేషన్ల సలహాలు, అభ్యంతరాలు తీసుకోకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏక పక్షంగా నిర్ణయం తీసుకుందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయమూర్తులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాన్నేపల్లి వెంకటాచలపతి, ఉపాధ్యక్షులు కాకి అంకయ్య, ప్రధాన కార్యదర్శి రాజేష్ రాయల్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో నీరాజనం





రేణిగుంటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వివేకానంద కాలనీలో ఎమ్మెల్యేపై పూలవర్షం

రేణిగుంట: ‘గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్థానికులు నీరాజనం పట్టారు. నిత్యం అందుబాటులో ఉంటూ తమకు అండగా ఉంటున్నారంటూ ప్రశంసించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రేణిగుంట పట్టణం వివేకానంద కాలనీ, బిస్మిల్లానగర్, వసుంధరనగర్, భగత్‌సింగ్ కాలనీ, రజక కాలనీ, గాంధీ కాలనీలలో పర్యటించి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయన్ను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటా ఆయనకు మహిళలు నవ్వుతూ ఆహ్వానించి పూలమాల వేసి కర్పూర హారతులు పట్టారు. మురుగునీటి కాలువలు నిర్మించాలని కొందరు మహిళలు కోరారు. దీంతో ఎమ్మెల్యే వారికి బదులిస్తూ 30ఏళ్లుగా వివేకానందకాలనీలో రోడ్డు కూడా లేదని, తాము అధికారంలోకి వచ్చాక సిమెంటు రోడ్డు వేశామన్నారు. కాలువలు కూడా త్వరలోనే నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వంలో రేణిగుంటలోని పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదని, తాము వచ్చాక రేణిగుంట మండలానికి 10వేల ఇంటిపట్టాలు అందించామన్నారు. వారిలో కొందరికి పట్టాలు ఇచ్చినా, చంద్రబాబు నాయుడు కోర్టుల్లో కేసులు వేయించి పేదల ఇళ్లను అడ్డుకున్నారని, ఆ సమస్యను కూడా త్వరలోనే పరిష్కరించి అందరికీ ఇంటిస్థలాలు చూపుతామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా సరాసరి నవరత్నాలు పథకాల కింద రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు నేరుగా ప్రజలకు అందిందని అక్క, చెల్లెమ్మలు చెప్పడం గొప్ప విషయమన్నారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో లెక్కకు మించి పథకాలను తీసుకొచ్చి విప్లవాత్మకమైన మార్పులను నాంది పలికారన్నారు. గత పాలనలో అర్హత ఉన్నా పథకాలు అందాలంటే పచ్చనేతల ఇళ్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, అయితే ప్రస్తుతం వలంటీర్‌ను నేరుగా ఇంటికి పంపించి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. ఈ మార్పును ప్రజలు విజ్ఞతతో గుర్తించి మేలు చేసిన జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షులు గంగారి రమేష్, మండల నాయకులు జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటసుబ్బమ్మ, రసూల్, మునిశేఖర్‌రెడ్డి, ఖదీర్, జగన్, ఇరానీ ఖాదర్, రఫీవుల్లా, షబ్బీర్ అహ్మద్, ఎంజీ రాజేష్, జాన్‌బాబు,మాజీ ఎంపీటీసీ నాగరాజు, రమణ, విజయలక్ష్మి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం





మాట్లాడుతున్న అపరంజి రాజు, పిచ్చాటూరు: ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నాగలాపురం: మండల కేంద్రంలోని బైటకొడియంబేడు సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. మండల కన్వీనర్ అపరంజిరాజు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా పేదలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ రోజు 338 మందికి వైద్య పరీక్ష చేసిన వారికి కేస్ షీట్లను అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీడీఓ పీకేఎం బాబు, స్థానిక సర్పంచ్ మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలోని కారూరు గ్రామంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్లు హమీద్, పవిత్ర, మోహన, దినేష్ ప్రజలకు వైద్యసేవలు అందించారు. శిబిరంలో మొత్తం 407 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్ రావు, సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ సభ్యులు వేలు, మండల అధ్యక్షుడు కే.వెంకటచలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

నేడు సంతవేలూరులో..

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. తద్వారా సచివాలయ పరిధిలో ఇప్పటికే గ్రామ వలంటీర్లు వైద్య సిబ్బంది ద్వారా గుర్తించబడిన అనారోగ్యం బారిన పడిన ప్రజలు శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు.

ముక్కంటి సేవలో పార్లమెంట్ కమిటీ సభ్యులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద పార్లమెంట్ కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని పార్లమెంట్ కమిటీ సభ్యులు సేవించుకున్నారు. గురువారం ఆలయ దక్షిణగోపురం వద్ద వారికి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ఓపెన్ వర్సిటీ గడువు పెంపు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ టి.నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లొమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు స్వయంగా యూనివర్సిటీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 9515401088లో సంప్రదించాలని కోరారు.

ప్రజల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత కిట్లు అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజలందరి ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఓ వరం లాంటిదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, గుమ్మడి బాలకృష్ణయ్య, పసల సుమతి, జయగోపాల్, కొల్లూరు హరినాథ్‌నాయుడు, మురళియాదవ్, పూడి రవి, ప్రమీలమ్మ, జయశ్రీ, ఇందిర, రుషేంద్రమణి, పురపాలకసంఘ అధికారులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష అని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఆమందూరు పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడించారు. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం 160 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి హరిత, ఎంపీడీఓ గిడ్డయ్య, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు రామయ్య ఆచారి, పట్రా సిద్దయ్య, దామోదరంరెడ్డి, రత్నయ్య పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సిబ్బంది, అధికారులు

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ: పేదలకు మెరుగైన వైద్యం అందించడానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారని మండల కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి తెలిపారు. మండలంలోని కాటూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్ క్లినిక్ వద్ద గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు, ఉచిత కళ్లజోడు ఇచ్చి వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ ఆధ్వర్యంలో వైద్యులు రాజేష్, లీలా, రాజశేఖర్ 414 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. పెద్దచికిత్స అవసరమైతే మెరుగైన డాక్టరు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రెఫరల్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, ఎంపీడీఓ నరసింహారావు, వైద్యసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.







పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, సమావేశానికి హాజరైన గ్రామస్తులు, వైద్య సిబ్బంది, బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



సత్యవేడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- నాటి టీడీపీ, నేటి వైఎస్సార్‌సీపీ పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిద్దాం
- టీడీపీ మోసాలను ప్రజల దృష్టికి తీసుకెళ్దాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: వచ్చే ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులు సమిష్టిగా పని చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం సత్యవేడు బేరిశెట్టి కళ్యాణ మండపంలో ‘ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి’ కార్యక్రమం ద్వారా సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త కూడా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను, ప్రస్తుత ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 నుంచి నేటి వరకు ఏం చేశారు ? ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూర్చారో గణాంకాలతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ఉచిత విద్య, వైద్య, సంక్షేమ పథకాలు పేదలకు అందాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలన్నారు. 2014 నుంచి 2019 వరకు సీఎంగా చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రజలకు చేసిన మోసంపై తెలియజెప్పి ప్రతి ఇంటి మీద వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వారు చేయాల్సిన విధులను స్క్రీన్‌పై చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నారాయణవనం జెడ్పీటీసీ, జిల్లా ఫైనాన్స్‌కమిటీ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ, జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబరు పి.విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ బి.సోమశేఖర్, సురుటుపల్లి ఆలయ కమిటీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మస్తానీ, శ్యాంప్రసాద్ రెడ్డి, సర్పంచులు రవిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శేఖర్, సన్యాసయ్య, రాబర్టు, గురుప్రసాద్, ఎంపీటీసీలు డివి శరవనన్, రమణ తదితరులు పాల్గొన్నారు.



రాచపాళెంలో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడులో..

సత్యవేడు: మండలంలోని రాచపాళెం గ్రామంలో గురువారం ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మితో కలసి ఎమ్మెల్యే ఆదిమూలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన సీఎం జగనన్నదే అన్నారు. పేద విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి దీవెన వంటి పథకాలను అందించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు కే.రవి, ఉషా, మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రూబెన్, ఎంపీటీసీ శెల్వి, ఎంపీడీఓ చంద్రశేఖర్, రమణ, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న ఎంజీఎం హెల్త్‌కేర్ సిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని మొక్కలచేను, గోవిందరాజు దరఖాస్తు, రామిరెడ్డిపాళెం గ్రామాల్లో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన ఎంజీఎం హెల్త్ కేర్ వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ మేరకు 3 గ్రామాల్లో 400 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే లోకా ఫౌండేషన్ ద్వారా హెల్త్ కార్డులను అందజేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, రుద్ర దాసాజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంజీఎం హెల్త్‌కేర్‌కు చెందిన వైద్యులు అనురాధ, మదీన, రూపిని, ఆనందరాజ్ పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష



సమీక్షలో చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలన భవనంలో గురువారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఆధ్వర్యంలో మాస్టర్‌ప్లాన్‌పై సమీక్షించారు. ఇందులో ద్రోణ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి శర్మ మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ మూడు దశల్లో అమలు చేసే విధంగా రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. మొదటి దశలో గాలిగోపురం నుంచి జల వినాయకుని వరకు కింద పార్కింగ్ మొదటి అంతస్తు క్యూకాంప్లెక్సు ఉండేలా నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. పై అంతస్తుల్లో రూ.500, రూ.750, రూ.1,500 రాహుకేతు పూజలు నిర్వహించుకునేలా నిర్మాణాలు చేయనున్నట్లు వివరించారు.

ఆంధ్రకు మళ్లీ జగనన్నే సీఎం కావాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- చంద్రబాబు మోసాలను జనంలోకి తీసుకెళ్లండి
- వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి విజయం సాధిద్దాం
- పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ఆదిమూలం దిశానిర్దేశం

వరదయ్యపాళెం: ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలి అనే అంశాన్ని వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ప్రతిఒక్కరూ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని స్థానిక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వరదయ్యపాళెంలోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలస్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ‘చంద్రబాబు.. నిన్ను నమ్మలేం..’, ‘జగనన్నే మా అందరి భవిష్యత్’ అంటూ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఎల్ఈడీ టీవీ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన కొన్నేళ్లుగా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు హామీలను ఇచ్చి ఎలా మోసం చేశాడో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గృహ సారథులు, పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అలాగే 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనతను ప్రజలకు తెలియజేయాలన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలు, అలాగే మిగిలి ఉన్న 6 మాసాల్లో మరింత అభివృద్ధి, సంక్షేమం చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని కోరారు. అలాగే అందరి సహకారంతో సత్యవేడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.



కన్వీనర్ దయాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

టీడీపీ వారే చంద్రబాబును నమ్మరు..

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని స్వయాన ఆయనను సొంత పార్టీ వారే నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మనం అప్రమత్తంగా ఉండాలని, లేదంటే మళ్లీ రాబందులు రాజ్యమేలే పరిస్థితులు వస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఒక్కటై జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే వరకు పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రెండవసారి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా నియమితులైన నాయుడు దయాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ శ్రేణులు ఘనంగా శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, బీఎస్‌కండ్రిగ మండల పార్టీ కన్వీనర్ విద్యానాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, తదితరులు పాల్గొన్నారు.